నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 హైదరాబాద్, శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 YADADRI BHUVANAGIRI

## జిల్లా ఓటర్లు 4,53,817

- తుది ఓటరు జాబితా విడుదల
- అత్యధికంగా మహిళా ఓట్లు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 8 : జిల్లాలో భువనగిరి–ఆలేరు నియోజక వర్గాలకు సంబంధించిన తుది ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషులు 2,24,942 మంది, మహిళలు 2,28,855 మంది, ఇతరులు 20 మంది మొత్తం 4,53,817 మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల ఓట్ల కన్నా మహిళల ఓట్లు 3,919 అధికంగా ఉన్నాయి. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 1,08,598 మంది, మహిళలు 1,11,358 మంది, ఇతరులు 1 మొత్తం 2,19,957 మంది ఓటర్లు ఉన్నారు. ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 1,16,344 మంది, మహిళలు 1,17,497 మంది, ఇతరులు 19 మొత్తం 2,33,860 మంది ఓటర్లు ఉన్నారు.

# గుట్ట మెడికల్ కాలేజీ తరలించుకుపోతుండ్రు!

## శ్రీలక్ష్మీనరసింహ స్వామి కళాశాల రద్దుకు ప్రభుత్వం ప్రయత్నాలు

- కొడంగల్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక
- గతేడాది మెడికల్ కాలేజీ ఏర్పాటుకు జీఓ
- కాలేజీ నిర్మాణానికి రూ.183 కోట్లు కేటాయింపు
- స్థల పరిశీలన చేసిన అధికారులు
- అసెంబ్లీ ఎన్నికలతో శంకుస్థాపన జాప్యం
- ఇప్పుడు ఏర్పాటు సాధ్యం కాదంటూ సర్కారు సాకులు
- పేద విద్యార్థులకు దూరం కానున్న వైద్య విద్య
- కాంగ్రెస్ తీరుపై దుమ్మెత్తి పోస్తున్న జిల్లా ప్రజలు



గతేడాది ఫిబ్రవరిలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి వేసిన శంకుస్థాపన శిలాఫలకం

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : పేద విద్యార్థులకు వైద్య విద్యనను అందుబాటులోకి తేవాలని కేసీఆర్ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని కొత్తగా కాలేజీలను తీసుకొచ్చింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పట్టుమని రెండు నెలలు కూడా కాలేదు, అప్పుడే మెడికల్ కళాశాలల రద్దుకు కుట్ర చేస్తున్నది. ఏవే సాకులు చెబుతూ పేదలకు వైద్య విద్య అందకుండా పన్నాగాలు పన్నుతున్నది. జిల్లాలోని యాదాద్రి మెడికల్ కళాశాలను సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌కు తరలించుకుపోయేందుకు దోఖా చేస్తున్నది. ఇదే జరిగితే వైద్య విద్యతోపాటు జిల్లా పజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందని ద్రాక్షగానే కానున్నాయి. కాంగ్రెస్ తీరుపై జిల్లా ప్రజలు, వివిధ సంఘాలు, సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కాలేజీని తరలించుకుపోవాలని చూస్తే ఊరుకునేది లేదని అల్టిమేటం జారీ చేస్తున్నాయి.

### హామీ ఇచ్చి అమలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

తెలంగాణ ఏర్పాటు తర్వాత నాటి బీఆర్ఎస్ సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసింది. గతంలో నాటి మంత్రి హరీశ్‌రావు జిల్లాకు వచ్చిన సందర్భంగా మెడికల్ కాలేజీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలో కొత్త కాలేజీ ఏర్పాటుకు గతేడాది జూలై 6న రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జీఓ నంబర్ 85ను విడుదల చేసింది. 100 సీట్ల కెపాసిటీతో కాలేజీ ఏర్పాటు చేస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల తరగతులు ప్రారంభం అవుతుందని జీఓలో పేర్కొన్నారు.

### కొండగల్‌కు తీసుకుపోయే కుట్ర

యాదగిరి గుట్టలో ఏర్పాటు చేయాలనుకున్న కాలేజీ కష్టసాధ్యమని ఉన్నతాధికారులు తేల్చినట్లు తెలిసింది. అధ్యాపకుల తీవ్ర కొరత, మౌలిక సదుపాయాల లేమీ, ఆస్పత్రులు లేవంటూ ఏవే కారణాలు చెబుతూ రద్దు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొండగల్‌కు తరలించుకుపోవాలనే కుట్ర జరుగుతున్నది. అక్కడ సైతం ఎలాంటి సదుపాయాలు, అధ్యాపకుల తీవ్ర కొరత ఉండదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అసలు కొండగల్‌లో 200 పడకల ఆస్పత్రి ఎక్కడదని ప్రశ్నిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన నియోజకవర్గానికి కాలేజీ కావాలనుకుంటే కొత్తగా మంజూరు చేయించుకోవచ్చని, ఉన్న చోట రద్దు చేయడం ఏంటని జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రూ. 183 కోట్లు మంజూరు

యాదగిరిగుట్టలో ఉన్న పీహెచ్‌సీని మొదటగా అప్పటి ప్రభుత్వం వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు 2022 నవంబర్ 29న జీఓ నంబర్ 772ను విడుదల చేసింది. దీని నిర్మాణ పనుల కోసం నిధులు కూడా మంజూరయ్యాయి. వంద పడకల ఏరియా ఆస్పత్రి కోసం శంకుస్థాపన కూడా చేశారు. దీని స్థానంలోనే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీలక్ష్మీనరసింహస్వామి మెడికల్ కాలేజీగా నామకరణం కూడా చేసింది. మొదట వంద పడకల ఆస్పత్రి కోసం శంకుస్థాపన చేసి స్థలంలో కాకుండా మరో చోట నిర్మించాలని భావించింది. భవన నిర్మాణం, క్యాంపస్ కోసం 20 ఎకరాల భూమి అవసరం పడుతుంది. నాడు గుట్టలోని నాలుగు ప్రదేశాలకు సంబంధించి ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు కూడా పంపించారు. ఇందులో ఒకటైన మల్లాపూర్‌లో సర్వే నంబర్ 64లో సుమారు 200 ఎకరాల విశాలమైన స్థలం ఉంది. ఇక్కడే నిర్మించాలని భావించారు. కాలేజీ నిర్మాణానికి రూ. 183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. అంతేకాకుండా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను కూడా నియమించారు. ఇదే క్రమంలో టెండర్ పిలిచేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో అది జాప్యం అయ్యింది.

### ఎన్నో విధాలుగా నష్టం..

మెడికల్ కాలేజీ రద్దు చేస్తే జిల్లావాసులకు ఎన్నో విధాలుగా నష్టం చేకూరనుంది. ఎన్నో ఏండ్లుగా కొట్లాడి తెచ్చుకున్న కళాశాల తరలిపోతే పేద విద్యార్థులు చాలా నష్టపోనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 100 ఎంబీబీఎస్ సీట్లతో కాలేజీ ఏర్పాటు కావడంతోపాటు తరగతులు అందుబాటులో వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడు కాలేజీ లేకుంటే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. కళాశాల ఉంటే దానికి అనుబంధంగా ఆస్పత్రి ఉంటుంది. దీని ద్వారా వందల మందికి నిత్యం సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించవచ్చు. సూపర్ స్పెషాలిటీ సేవలు కలుపుకొని, మొత్తం 35 రకాల వైద్య విభాగాలు సేవలు అందే అవకాశం ఉంటుంది.

అత్యాధునిక వైద్య పరికరాలు, ల్యాబ్‌లు ఉంటాయి. డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులోకి వస్తుంది. మెడికల్ కాలేజీలతో అనుబంధంగా అనేక వసతులు ఏర్పడనున్నాయి. కళాశాలలో పని చేయడానికి భారీగా సిబ్బంది అవసరం ఉంటారు. కళాశాల ఏర్పాటుతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగనున్నాయి. కొత్తగా ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను రిక్రూట్ చేయనున్నారు. అంతేకాకుండా డాక్టర్లు, మెడికల్ స్టాఫ్‌ను నియమించనున్నారు. ప్రత్యక్షంగానే గాకాకుండా పరోక్షంగా కూడా వందల మందికి ఉపాధి దక్కనుంది. ఇప్పుడు కాలేజీ తరలిపోతే ఇవన్నీ దక్కకుండా పోతాయి.

### నాడు గొంగిడి సునీత కృషి..

యాదగిరిగుట్టలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అవిరళ కృషి చేశారు. అనేక సార్లు నాటి సీఎం కేసీఆర్, అప్పటి మంత్రి హరీశ్ రావును స్వయంగా కలిసి విజ్ఞప్తులు చేశారు. ఎట్టకేలకు కళాశాల సాధించారు. కాలేజీకి శ్రీలక్ష్మీనరసింహ స్వామి కళాశాలగా నామకరణం చేయించారు. ఎక్కడ ఏర్పాటు చేయాలనేది దానిపై పలు సార్లు సమావేశమయ్యారు. శంకుస్థాపన చేయాలనుకునే తరుణంలోనే ఎన్నికలు రావడంతో పెండింగ్‌లో పడిపోయింది.

### స్పందించని ఎమ్మెల్యే బీర్ల

వైద్య కళాశాల తరలించుకుపోతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. దీనిపై ఆలేరు నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కానీ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాత్రం దీనిపై ఇప్పటి వరకు స్పందించ లేదు. నియోజకవర్గానికి కొత్త ప్రాజెక్టులు తేవాల్సింది పోయి.. గెలిపించిన రెండు నెలలు కాకముందే ఉన్న ప్రాజెక్టులు ఊడ్చుకుపోతుంటే కిమ్మనకుండా ఉండటంపై ప్రజలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు.

## వైభవంగా లక్ష్మీనరసింహుడి నిత్య కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవ సేవను అర్చకులు వైభవంగా, శాస్త్రోక్తంగా జరిపారు. గురువారం ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్య కల్యాణ తంతు నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రివేళ స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. మాస శివరాత్రి సందర్భంగా పురోహితులు పరమశివుడికి దక్షిణావ్రత శంఖాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం అత్యంత వైభవంగా జరిపారు. పాత గుట్ట స్వామి వారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు ...వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. --- ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

### కొండపైన ఏటీఎం సెంటర్

యాదగిరిగుట్ట కొండపైన భక్తుల సౌకర్యార్థం ఏటీఎం సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఏటీఎం ఏర్పాటు ప్రక్రియను సెంట్రల్ బ్యాంకు అధికారులు గురువారం ప్రారంభించారు. భక్తుల కోరిక మేరకు ఏర్పాటు చేస్తున్న ఏటీఎం మూడు రోజుల్లో అందుబాటులోకి రానుంది.

## వైద్య కళాశాలను తరలిస్తే నిరాహార దీక్షకు దిగుతాం

- ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి కొడంగల్ ప్రజలే ముఖ్యమా?
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 8 : యాదగిరి గుట్టకు మంజూరైన మెడికల్ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గానికి తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఇక్కడి ప్రాంతానికి అన్యాయం చేస్తే ఊరుకోమని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెలలోపు మంజూరై శంకుస్థాపన చేసిన వంద పడకల ఆసుపత్రిని నిర్మించడంతోపాటు మల్లాపురం సర్వే నంబర్ 64లో వైద్య కళాశాలను నిర్మించేందుకు పనులు ప్రారంభించాలని, లేకపోతే మార్చి1న గుట్టలో రిలే నిరాహార దీక్షకు దిగనున్నట్లు వెల్లడించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ రూ. 183 కోట్ల నిధులు కేటాయించి 2023 జూలై 5న యాదగిరిగుట్టకు 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్య ం కలిగిన ప్రభుత్వ మెడికల్ కళాశాలను (జీఓ నంబర్ 85) మంజూరు చేశారని చెప్పారు. ఇందుకోసం మల్లాపురంలో సర్వే నంబర్ 64లో 200 ఎకరాల స్థలం చూపించగా 15 ఎకరాల మాత్రమే ఇతరులకు అసైన్డ్ చేసిన్నట్లు రికార్డులో ఉందని తెలిపారు. 20 ఎకరాల్లో వైద్య కళాశాల ఏర్పాటుకు గతంలో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వైద్య కళాశాల శంకుస్థాపన జాప్యం జరిగిందని చెప్పారు. మెడికల్ కళాశాల వస్తే ఇక్కడి ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలతోపాటు నాణ్యమైన వైద్యం స్వతరమే అందే అవకాశం ఉందన్నారు. వైద్య కళాశాలను కొండగల్‌కు తరలించుకుపోవడం సరైంది కాదని తెలిపారు. హాస్పిటల్ లేదనే సాకుతో మెడికల్ కళాశాలను రద్దు చేస్తున్నట్లు చెప్పడం కరెక్ట్ కాదని తెలిపారు. మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తే 300 పడకల ఆస్పత్రితోపాటు అన్ని విభాగాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారని, కొడంగల్ ప్రజలు మాత్రమే తమకు అవసరమా? యాదగిరిగుట్ట ప్రజలు బాగోగులు అవసరం లేదా? అని ప్రశ్నించారు. జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధ్యత తీసుకుని వైద్య కళాశాల తరలింపును ఆపాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్‌గౌడ్, బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ ఎంపీపీ పల్లెపాటి సత్యనారాయణ, జడ్పీటీసీలు తోటకూరి అనూరాధ, పల్లా వెంకట్‌రెడ్డి, ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ పాండరి గౌడ్, ఎంపీటీసీ రేపాక మౌనిక, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆరె యాదగిరి, కసావు శ్రీనివాస్, కౌన్సిలర్ తాళ్లపల్లి నాగరాజు, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, సర్పంచ్ తోటకూరి బీరయ్య, గుండాల మండలాధ్యక్షుడు ఖలీల్, నాయకులు పైళ్ల సత్యనారాయణ, మిట్ట వెంకటయ్య, కవిడే మహేందర్, కళ్లెం స్వాతి గౌడ్, పుట్ట మల్లేశ్, బాషబోయిన ఉప్పలయ్య పాల్గొన్నారు.

## మున్సిపల్ యాప్‌పై అవగాహన

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 8 : అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు పాఠశాలల్లో భువనగిరి మున్సిపాలిటీ యాప్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి యాప్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా పౌర సేవలతోపాటు సెప్టిక్ ట్యాంక్లను ఖాళీ చేయించడానికి ప్రత్యేకమైన లింకును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సంబంధించిన సెల్‌ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలని సూచించారు. ఏదైనా అవసరం ఏర్పడినప్పుడు యాప్ ద్వారా ఫిర్యాదును నమోదు చేసుకోవడం, సత్వరమైన సేవలు పొందటానికి వీలు కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌సీఐ ప్రతినిధులు అవినాశ్, దోసపాటి శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

## 'చలో నల్లగొండ'కు 10వేల మందిని తరలిస్తాం

- కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 8 : కృష్ణా జలాలను రక్షించుకునేందుకు మాజీ సీఎం, ఉద్యమ నేత కేసీఆర్ నల్లగొండలో తలపెట్టిన భారీ బహిరంగ సభకు ఆలేరు నియోజకవర్గం నుంచి పది వేల మందిని తరలిస్తామని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ భవనంలో గురువారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ నాయకుల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ నేత కేసీఆర్ సారథ్యంలో 14 ఏండ్లు సుదీర్ఘంగా పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణను సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు అప్పజెప్పాలని చూస్తున్నారని ఆరోపించారు. మన ప్రాంతానికి రావాల్సిన కృష్ణా జలాలను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సాగు జలాలను రక్షించుకునేందుకు మళ్లీ పోరాటం చేద్దామని, ప్రతి ఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ పదేండ్లుగా ప్రాజెక్టులను కాపాడుకుంటూ వచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలలు గడువకముందే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందని ఆరోపించారు. కృష్ణా జలాల విషయంలో కేంద్రం తలదూర్చవద్దని అప్పటి సీఎం కేసీఆర్ నిర్మోహమాటంగా చెప్పారని గుర్తు చేశారు.

నల్లగొండ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని, ఆరు నూరైనా సభను నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. పోలీస్ యాక్ట్‌లు బీఆర్ఎస్ పార్టీకి కొత్తేమీ కాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్, మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకర్, వైస్ చైర్మన్ కాటంరాజు, జడ్పీటీసీ పల్లా వెంకట్ రెడ్డి, నాయకులు ఖలీల్, సత్యనారాయణ, పాండరిగౌడ్, వెంకటయ్య, నరహరి, నరసింహ, సత్యనారాయణరెడ్డి, మల్లేశ్‌గౌడ్, పవన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# 'చలో నల్లగొండ'కు సన్నాహాలు



- క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారానికి బీఆర్ఎస్ సన్నద్ధం
- మండలాల వారీగా పార్టీ శ్రేణులతో సమీక్ష
- ప్రాజెక్టుల అప్పగింతతో జరిగే నష్టంపై ప్రజల్లోకి..
- ఈ నెల 13న సభకు తరలి వచ్చేలా చూడడమే లక్ష్యం
- బహిరంగ సభకు నేటి నుంచి ముమ్మర ఏర్పాట్లు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): కేఆర్ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టులను అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండ బహిరంగ సభకు విస్తృతంగా సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ తీరుతో కృష్ణానది పరీవాహక ప్రాంతానికి జరుగనున్న నష్టంపై ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా ఈ సభ ద్వారా ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని విషయాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయనున్నారు. తద్వారా రానున్న కాలంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయడమే సభ ప్రధాన లక్ష్యం. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా బీఆర్ఎస్ విస్తృత ప్రచారానికి రంగంలోకి దిగింది.

### నియోజకవర్గాల వారీగా సమావేశాలు

ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న బహిరంగ సభపై బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. ఇప్పటికే సభా స్థలం ఎంపిక పూర్తి కాగా అనుమతి కోసం పోలీస్ శాఖకు లేఖ అందజేసింది. నేటి నుంచి సభా స్థలంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లపై దృష్టి సారించనున్నారు. మరోవైపు సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టుల అప్పగింత వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించడం ద్వారా వారిని స్వచ్ఛందంగా కదలివచ్చేలా చేయాలని భావిస్తున్నారు. అందుకే ముందు పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయి వరకు కదిలించేలా సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. గురువారం ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు నియోజకవర్గాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు, ప్రాజెక్టులకు వాటిల్లనున్న ముప్పు, దీనిపై కేసీఆర్ ఆలోచన, బహిరంగ సభ లక్ష్యం తదితర అంశాలను పార్టీ శ్రేణులకు వివరించారు. సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా పార్టీ యావత్ రంగంలోకి దిగి చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం యాదగిరిగుట్ట, భువనగిరి, నకిరేకల్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు పూర్తి కాగా తుంగతుర్తిలో బుధవారమే జరిగింది. మిగతా అన్ని చోట్ల ఒకటిరెండు రోజుల్లో పూర్తి చేయనున్నారు. మరోవైపు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో బహిరంగ సభ ఏర్పాట్లపై కసరత్తు మొదలు పెట్టారు. ఇప్పటికే సభాస్థలాన్ని ఎంపిక చేశారు. అనుమతి కోసం కూడా పోలీసు వారికి పార్టీ పరంగా లేఖను అందజేశారు. శుక్రవారం పోలీసు శాఖ నుంచి అనుమతిపై ప్రకటన రానుందని భావిస్తున్నారు. ఆ తర్వాత చకచకా సభా వేదిక నిర్మాణం, గ్యాలరీల ఏర్పాటు, బారీకేడింగ్, పార్కింగ్ స్థలాలను సిద్ధం చేయడం వంటి పనులన్నీ వేగవంతం కానున్నాయి. ఈ నెల 13న మధ్యాహ్నం 3గంటలకు బహిరంగ సభ జరుగనుండగా పార్టీ అధినేత కేసీఆర్ రోడ్డు మార్గంలోనే నల్లగొండకు రానున్నట్లు తెలిసింది.

## చలో నల్లగొండకు తరలిరండి

- కృష్ణా జలాలపై ప్రశ్నించే గొంతుక అవుదాం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



బీఆర్ఎస్ నకిరేకల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన బీఆర్ఎస్ నేతలు చెరుకు సుధాకర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, గుత్తా అమిత్‌రెడ్డి

నకిరేకల్, ఫిబ్రవరి 8 : కేంద్రం పరిధి నుంచి శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కాపాడుకునేందుకు ఈ నెల 13న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కేసీఆర్ బహిరంగ సభకు తరలిరావాలని, కృష్ణానది జలాలపై ప్రశ్నించే గొంతుక అవుదామని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. నకిరేకల్‌లో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడం ఎంతవరకు సమంజసమన్నారు. హామీలు నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కేఆర్ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టుల అప్పగింతను నిరసిస్తూ బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండకు భారీ సంఖ్యలో జన సమీకరణ చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మండలాలు, గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలన్నారు. గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ బాలరాజు యాదవ్ మాట్లాడుతూ ఢిల్లీ పార్టీలను బొందపెట్టిన చరిత్రలు ప్రాంతీయ పార్టీలకు చాలా ఉన్నాయని, వంద రోజుల్లో అమలు చేస్తామన్న 420 హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే బొంద పెడుతారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి ఎంపీ స్థానాలను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని గులాబీ శ్రేణులను కోరారు. అనంతరం చలో నల్లగొండ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, తరాల బలరాం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్ రెడ్డి, తక్కెళ్లపల్లి ప్రభాకర్‌రావు, సిల్వేరు ప్రభాకర్, సందినేని వెంకటేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు సోమ యాదగిరి, చల్లా కృష్ణారెడ్డి, నడికుడి ఉమారాణి, నవీన్‌రావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

### బహిరంగ సభను విజయవంతం చేయాలి

నార్కట్‌పల్లి : నల్లగొండలో 13న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభను విజయవంతం చేసేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ చేతగానితనం వల్లే కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత

- చలో నల్లగొండ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్ర
- బీఆర్ఎస్ శ్రేణులు సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే, చలో నల్లగొండ కోర్డినేటర్ సుంకె రవిశంకర్
- భువనగిరిలో బీఆర్ఎస్ నియోజకవర్గ సన్నాహక సమావేశం



చలో నల్లగొండ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి, జీవీ రామకృష్ణారావు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల నల్లగొండకు తీవ్ర నష్టం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, చలో నల్లగొండ భువనగిరి కోర్డినేటర్ సుంకె రవిశంకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతగానితనం వల్లే ప్రాజెక్టులకు కేఆర్ఎంబీకి చేతికి వెళ్లాయని మండిపడ్డారు. భువనగిరి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం చలో నల్లగొండ సభపై భువనగిరి నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు తదితరులతో కలిసి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సుంకె రవిశంకర్ మాట్లాడుతూ కృష్ణా జలాల పంపిణీని కేఆర్ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించడం వల్ల ఎడమ కాల్వ రైతాంగం మళ్లీ తిరోగమనం అయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. సాగర్ డ్యామ్ కేంద్ర బలగాల చేతికి వెళ్లిందని, మనల్ని అడుగు కూడా పెట్టనియ్యడం లేదని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, పాలమూరు జిల్లాలు సాగు, తాగునీటికి ఇక కేంద్రం అనుమతి కోసం ఎదురు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ పదేళ్లుగా ప్రాజెక్టులను కాపాడుకుంటూ వచ్చారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుమని రెండు నెలలు గడువక ముందే కేఆర్ఎంబీకి అప్పగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని, ఆరు నూరైనా సభను నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. పోలీస్ యాక్ట్‌లు, నిర్బంధాలు సంకెళ్లు తమకు కొత్త కాదన్నారు. నల్లగొండ సభలో కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పిన కాంగ్రెస్ నాయకుల బాగోతం బట్టబయలు అవుతుందని తెలిపారు. ఏదో ఆశించి కాంగ్రెస్ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెబుతున్నదని ఆరోపించారు. చలో నల్లగొండ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని, భువనగిరి నియోజకవర్గం నుంచి 20 వేల మంది పైగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు డాక్టర్ జడల అమరేందర్, కొలుపుల అమరేందర్, రామన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ రాజవర్ధన్ రెడ్డి, బండ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.